సాక్షి
కాకినాడ
శనివారం | 13 | జూలై | 2024



రూ.3 లక్షల విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అనుమలశెట్టి సాయి, సరస్వతి దంపతులు (విజయనగరం) శుక్రవారం రూ.3 లక్షల విరాళం సమర్పించారు.



...అందరి మేలెంచి..

పుడమి తల్లి పరిరక్షణకు 'అమ్మ పేరిట ఒక మొక్క' ప్రతి ఒక్కరూ నాటాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపునకు స్కూళ్లల్లో మంచి స్పందన కనిపిస్తోంది. - 8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 71,514 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. ఖరీఫ్ సాగు కోసం తూర్పు డెల్టాకు 3,800, సెంట్రల్ 1,700, పశ్చిమ డెల్టాకు 6 వేలు కలిపి మొత్తం 11,500 క్యూసెక్కుల నీరు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.75 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

వికాసలో ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో 24/7 ఏఐ కంపెనీలో వాయిస్ (కస్టమర్ సర్వీస్ అడ్వైజర్), నాన్ వాయిస్ (డిజిటల్ చాట్ అసోసియేట్) ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఏడాదికి రూ.2.4 లక్షల నుంచి రూ.3.5 లక్షల జీతం, ఆయా ఉద్యోగాలను బట్టి ఇన్సెంటివ్‌లు ఉంటాయని తెలిపారు. ఎంపికైన వారు బెంగళూరులో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజుల్లో ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

పెద్దాపురంలో 15న పీజీఆర్ఎస్

కాకినాడ సిటీ: పెద్దాపురం మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘం కల్యాణ మండపంలో వచ్చే సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నారు. కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా దిగువ, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని తెలిపారు.

మహిళా ఉద్యోగుల కోసం పోష్ చట్టం



సదస్సులో మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి ప్రవీణ

కాకినాడ సిటీ: పని చేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్ (పోష్) యాక్ట్ సహాయపడుతుందని జిల్లా అధికారులు అన్నారు. ఈ చట్టంపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.ప్రవీణ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌ఓ డి.తిప్పేనాయక్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.రత్నకుమార్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బుల్లిరాణి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ పి.రామచంద్రరావు, లీగల్ అధికారి ఎం.సుధాకర్‌బాబు, న్యాయవాది కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. మహిళలపై దాడులు, వేధింపులు పోష్ యాక్ట్ తదితర అంశాలను వివరించారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగులకే కాకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ పోష్ యాక్ట్ వర్తిస్తుందని చెప్పారు. ప్రతి 10 మంది కలసి పని చేసే చోట యాజమాన్యం ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రతి డిపార్టుమెంట్‌లో ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అలా చేయని సంస్థలపై పోష్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని ప్రవీణ హెచ్చరించారు.

20న జెడ్పీ స్థాయీ సమావేశాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్‌లో 1 నుంచి 7 వరకూ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 20న నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశపు మందిరంలో ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. వీటికి సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పుష్కర, పోలవరం కాలువ గట్లపై గ్రీన్ కారిడార్



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

జగ్గంపేట: గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో పుష్కర, పోలవరం కాలువ గట్లపై పెద్ద ఎత్తున మొక్కలు పెంచి, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రీన్ కారిడార్ ఏర్పాటుకు అంచనాలు తయారు చేస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపల చెరువుల తవ్వకానికి అనుమతులు వచ్చాయన్నారు. గ్రామ పంచాయతీలు ఖాళీ ప్రదేశాలు చూపిస్తే వాటిని చేపల చెరువులుగా తయారు చేస్తామని తెలిపారు. చెరువుల చుట్టూ ఆదాయాన్నిచ్చే కొబ్బరి, మామిడి, తదితర చెట్లు పెంచుకోవచ్చన్నారు. చేపల పెంపకానికి చెరువులను లీజుకు ఇవ్వడం ద్వారా పంచాయతీలకు కూడా మంచి ఆదాయం వస్తుందన్నారు.

వేట నిషేధం.. భృతి సశేషం

- ఇంకా పరిహారం అందక మత్స్యకారుల నిట్టూర్పు
- నిర్ణయం తీసుకోని కొత్త ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ హయాంలోనే బాగుందంటున్న గంగపుత్రులు
- రెండు ప్రభుత్వాల విధానాలపై బేరీజు



వేట నిషేధ సమయంలో ఉప్పుటేరులో నిలిపివేసిన బోట్లు (ఫైల్)

కాకినాడ సిటీ: అడగకుండానే అమ్మయినా అన్నం పెట్టదంటారు. ఇది అందరికీ తెలిసిన సామెతే. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు అడగకుండానే, అమ్మకన్నా మిన్నగా పథకాలు అందేవి. ఇప్పుడు కొత్త ప్రభుత్వంలో వెనుకబాటుతనం వెంటాడుతోంది. అది మత్స్యకారులకు అందించే వేట నిషేధ పరిహారం విషయంలో నిజమవుతోంది. సముద్రంలో చేపల వేట నిషేధ సమయం ముగిసి దాదాపు నెల రోజులు అవుతోంది. గంగపుత్రులు మళ్లీ వలలు పట్టుకుని సముద్రంలోకి వెళ్తున్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ వేట నిషేధ భృతి చెల్లించలేదు. కొత్త ప్రభుత్వం వచ్చి నెల రోజులైనా, తమ వెతలు తీర్చడం లేదంటూ కడలి పుత్రులు కన్నీరు పెట్టుకుంటున్నారు. వేట నిషేధ పరిహారం వెంటనే అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. సముద్రంలో చేపల వేటను ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకూ నిషేధించారు. చేపలు, ఇతర సముద్ర జీవుల పునరుత్పత్తి జరిగే కాలం కావడంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆ సమయంలో సముద్రంలో ఏటా చేపల వేటను నిషేధిస్తుంది. దీంతో ఈ రెండు నెలలూ మత్స్యకారులు జీవనోపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతూంటారు. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకుని వస్తూంటారు. ఇలా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఏటా వేట నిషేధ భృతి చెల్లిస్తూంటుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట ఏటా పరిహారం చెల్లించేవారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయం కావడంతో మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందాల్సిన ఆర్థిక సాయం ఆలస్యమైంది. వాస్తవానికి మత్స్యశాఖ అధికారులు ఎన్నికల సమయంలోనే వేట నిషేధ భృతికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా మత్స్యకారులకు చెల్లించాల్సిన పరిహారంపై ప్రభుత్వం నోరు మెదపలేదు.

- కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 8 తీరప్రాంత మండలాలు ఉన్నాయి. ఇక్కడ 75 వేల మంది మత్స్యకారులు నివసిస్తున్నారు. 185 మత్స్యకార సహకార సంఘాలు ఉండగా, వీటి పరిధిలో 22,862 మంది మత్స్యకారులు ఉన్నారు. సముద్రంలో వేటకు వెళ్లే 9,575 మందికి వేట నిషేధ భృతి కింద రూ.9.57 కోట్లు చెల్లించాల్సి ఉంది.

గత ప్రభుత్వ హయాంలో ఇలా..

2014–19 మధ్య టీడీపీ హయాంలో లబ్ధిదారునికి రూ.4 వేలు మాత్రమే వేట నిషేధ భృతి అందించేవారు. అదీ లబ్ధిదారులు వందల్లో మాత్రమే ఉండేవారు. రకరకాల కారణాలు చూపుతూ చాలా మందికి వేట నిషేధ భృతి చెల్లించేవారు కాదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట ఈ సాయాన్ని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో వేట నిషేధ భృతి అందించేవారు. ఇలా ఏటా క్రమం తప్పకుండా నిషేధ సమయంలోనే భరోసా అందజేయడంతో మత్స్యకారులకు ఊరట లభించేది. గత సంవత్సరం కాకినాడ జిల్లాలో 24,147 మందికి రూ.24.147 కోట్లు అందజేశారు. అదే విధంగా 2019–20 నుంచి 2023–24 వరకూ వేట నిషేధం కారణంగా ప్రభావితమైన 1,23,531 మంది బోటు యజమానులు, కళాసీలు తదితర లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.123.531 కోట్లు జమ చేశారు. అలాగే ఓఎన్‌జీసీ పైపులైన్ కారణంగా ఉపాధి కోల్పోయిన 7,050 మందికి రూ.145.93 కోట్ల సాయం అందించారు. సముద్రంలో వేటకు వెళ్లే ప్రతి మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకు డీజిల్ రాయితీ అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వేట నిషేధ భృతి ఇవ్వలేదు.

అప్పట్లో ఎదురుచూపులు లేవు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధం ముగియకుండానే లబ్ధిదారులకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించేవారు. అప్పట్లో పరిహారం కోసం ఎప్పుడూ ఎదురు చూడలేదు. ప్రస్తుతం వేట నిషేధం ముగిసింది. నేటికీ వేట నిషేధ పరిహారం అందకపోవడంతో మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించాలి.

– వానుపల్లి కృష్ణ, మత్స్యకార సంఘ నాయకుడు, దుమ్ములపేట, కాకినాడ

అప్పలతో సతమతం



వేట నిషేధ సమయంలో ప్రభుత్వం నుంచి పరిహారం అందక రెండు నెలల పాటు మత్స్యకారులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొచ్చారు. గత ప్రభుత్వంలో ఏటా క్రమం తప్పకుండా రూ.10 వేల చొప్పున ఇచ్చేవారు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో పరిహారం ఇంకా అందలేదు. వేట నిషేధం పూర్తయినా సొమ్ము అందక, అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు.

– ఏరుపల్లి సీతారామరాజు, కాకినాడ

రీసర్వేకు ఆదేశాలు

ఇప్పటికే అధికారులు అర్హుల జాబితా రూపొందించగా.. ఈ జాబితాపై మరోసారి సర్వే చేయాలని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను తాజాగా ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో చాలాచోట్ల అనర్హులకు ఈ పరిహారం అందిందనే పేరుతో ఈ రీసర్వే చేసి, తాజా నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మత్స్యశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీసర్వేకు ఆదేశించారు. అయితే, ఆర్థిక భారం తగ్గించుకునే ఉద్దేశంతో లబ్ధిదారుల సంఖ్యలో కోత వేసేందుకే ఈ తతంగమంతా నడుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇది సరికాదని, ఇప్పటికే రూపొందించిన జాబితా ప్రకారం అర్హులందరికీ వేట నిషేధ భృతి ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

- తూర్పు గోదావరి జిల్లాలోని 97 మత్స్యకార సంఘాల పరిధిలో 10,847 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. వీరందరూ గోదావరిలో వేట సాగిస్తూ జీవనం సాగిస్తారు. వీరు కాకుండా సముద్రంలో వేటకు వెళ్లి పొట్ట పోసుకునే మత్స్యకార కుటుంబాలు 529 ఉన్నాయి. వీరికి రూ.10 వేల చొప్పున రూ.5.29 కోట్ల మేర వేట నిషేధ పరిహారం ఇవ్వాలి.
- కాకినాడ జిల్లాలో 42,300 మత్స్యకార కుటుంబాలు సముద్ర వేట, దాని అనుబంధ పనులపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇక్కడ 25,419 మందికి రూ. 25.42 కోట్ల పరిహారం అందించాలి. దీని కోసం వారంతా ఎదురు చూస్తున్నారు.

నెలాఖరులోగా ఎఫ్‌సీఐ, సీఎస్‌సీకి బియ్యం పంపిణీ చేయాలి



రైస్ మిల్లర్లసమావేశంలో మాట్లాడుతున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: రబీలో సేకరించిన ధాన్యంలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సివిల్ సప్లైస్ కార్పొరేషన్(సీఎస్‌సీ)లకు ఈ నెలాఖరులోగా బియ్యం పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. ఈ విషయంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈ అంశంపై మిల్లర్లు, సివిల్ సప్లైస్, ఎఫ్‌సీఐ అధికారులతో తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుకున్న సమయానికే బియ్యం పంపిణీ చేస్తామని మిల్లర్లు చెప్పారు. బియ్యం పంపిణీలో సమస్యలను జేసీకి వివరించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు.

రేషన్ బియ్యంపై నిరంతర నిఘా

- అక్రమాలను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ వ్యవస్థ
- పోర్టులో చెక్‌పోస్టులు
- రూ.215 కోట్ల విలువైన 51,427 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్
- కలెక్టర్ షాన్ మోహన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్. చిత్రంలో జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: రీసైక్లింగ్ ద్వారా రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా నిరోధించేందుకు నిరంతరం పటిష్ట నిఘా, తనిఖీలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై ముందుగా అందిన సమాచారం ఆధారంగా 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా 119 రైస్ మిల్లులు, 76 పెద్ద గోడౌన్లలో జాయింట్ కలెక్టర్, పౌరసరఫరాల అధికారుల ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రతి మిల్లులో బియ్యం నిల్వలు, కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) డేటా తనిఖీ చేసి, అనుమానిత అక్రమ నిల్వల శాంపిళ్లను ల్యాబ్ పరీక్షలకు పంపామని చెప్పారు. మొత్తం రూ.215 కోట్ల విలువైన 51,427 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేశామని, ఇందులో 12,184 మెట్రిక్ టన్నుల బియ్యం రీసైకిల్డ్ బియ్యంగా నిర్ధారణ అయిందని తెలిపారు. మరో 11 వేల టన్నుల బియ్యం నిల్వలపై పరీక్షల నివేదికలు రావాల్సి ఉందని అన్నారు. నిల్వల తనిఖీలతో పాటు, పౌష్టికతను పెంచేందుకు రేషన్ బియ్యంలో కలుపుతున్న కెర్నల్స్ ద్వారా రీసైక్లింగ్ బియ్యాన్ని సులువుగా గుర్తించవచ్చని చెప్పారు. బియ్యం అక్రమ నిల్వలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని, అలాగే కొనుగోలుదారుల నుంచి ఎగుమతిదారుల వరకూ పాత్రధారులందరినీ గుర్తించి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. సమాచారం అందినప్పుడు మాత్రమే కాకుండా, అనుమానిత నిల్వలపై ఆకస్మిక దాడులు కూడా నిర్వహిస్తున్నామని, అక్రమాలు పూర్తిగా అరికట్టేంత వరకూ తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. పాలిష్ చేసిన రేషన్ బియ్యం యాంకరేజి పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి అవుతున్నట్లు గుర్తించామని, ఈ అక్రమ కార్యకలాపాల నిరోధానికి పోర్టు, కస్టమ్స్, పోలీస్, పౌరసరఫరాలు తదితర 8 శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా పోర్టుకు చేరే ప్రధాన రోడ్లు, పోర్టు లోపల రీసైక్లింగ్ రేషన్ బియ్యాన్ని గుర్తించేందుకు తగు శిక్షణ కల్పించిన అధికారులు, సిబ్బందితో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ షాన్ మోహన్ వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, నిత్యావసర సరకుల ధరల నియంత్రణకు కాకినాడ, పిఠాపురం, గొల్లప్రోలు, కత్తిపూడి, తునిల్లో 13 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటి ద్వారా కేజీ కందిపప్పు రూ.160కి, స్టీమ్డ్ రైస్ రూ.49కి, రా రైస్ రూ.48కి విక్రయిస్తున్నామని చెప్పారు. కూరగాయల ధరల నియంత్రణకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంపీ ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బాలసరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో ముగ్గురికి డయేరియా



ఆస్పత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: నగర పాలక సంస్థ పరిధిలోని పర్లోపేట, దుమ్ములపేట ప్రాంతాల్లో ముగ్గురు డయేరియా బారిన పడ్డారు. ప్రస్తుతం వారు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, మున్సిపల్ ఆరోగ్య అధికారి (ఎంహెచ్‌ఓ) డాక్టర్ పృథ్వీచరణ్, ఇతర అధికారులు శుక్రవారం రాత్రి జీజీహెచ్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు కమిషనర్ సూచించారు. పర్లోపేట, దుమ్ములపేట ప్రాంతాలను కమిషనర్ వెంకటరావు, ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి సందర్శించారు. బాధితులు నివసించే పరిసరాల్లోని ఇళ్ల వద్ద మంచినీటి నమూనాలను పరిశీలించారు. పరీక్షల అనంతరం నగరపాలక సంస్థ ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిలో ఎటువంటి కాలుష్యం లేదని నిర్ధారణకు వచ్చారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ, ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పర్లోపేట, దుమ్ములపేట ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఎంహెచ్‌ఓను ఆదేశించారు. సర్వేలెన్స్ బృందాలను కూడా పంపించి డయేరియాకు కారణాలను గుర్తించాలని సూచించారు.

సాధ్యం కాని సేద్యం

- కోనసీమ జిల్లాలో ముందుకు సాగని ఖరీఫ్
- సాగు లక్ష్యం 1,68,760 ఎకరాలు
- ఇప్పటి వరకూ 40,038 ఎకరాల్లో నాట్లు, వెదజల్లు
- వర్షాలకు పలుచోట్ల నారుమడులు నీట మునక
- గుర్రపు డెక్కతో పూడుకుపోయిన డ్రెయిన్లు
- ఉమ్మడి జిల్లాల్లో 306 పనుల గుర్తింపు
- రూ.20.78 కోట్ల కేటాయింపు
- ఎన్నికల కారణంగా అనుమతులు ఆలస్యం
- అధ్వాన డ్రైనేజీ వ్యవస్థ వల్ల సాగు చేయలేకపోతున్న రైతులు



రాజోలు మండలం మేడిచర్లపాలెంలో వర్షానికి నీట మునిగిన వరి నారుమడులు

సాక్షి, అమలాపురం: 'ఖరీఫ్' సాగుకు వర్షాలు ఆదిలోనే హంసపాదులా మారాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు డెల్టాలోని శివారు ప్రాంతాల్లో నారుమడులు, నాట్లు వేసిన చేలు ముంపుబారిన పడుతుండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గుర్రపుడెక్క, తూడుతో డ్రెయిన్లు మూసుకుపోవడంతో పాటు కూనవరం, వాసాలతిప్ప, శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ల మొగలు మూసుకుపోవడం వల్ల ముంపునీరు దిగే అవకాశం కనిపించడం లేదు. దీనితో రైతులు సాగు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కోనసీమ జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల్లో 1,68,760 ఎకరాలలో ఖరీఫ్ సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఖరీఫ్‌కు సంబంధించి 6,300 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 6,280 ఎకరాల్లో (99 శాతం) పడ్డాయి. కానీ నాట్లు మాత్రం మందకొడిగా 40,031 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. దీనిలో 25,760 కూలీల ద్వారా నాట్లు వేయించగా, 14,271 వెదజల్లు పద్ధతి. ముందస్తు సాగు చేయడం ద్వారా విపత్తుల నుంచి ఖరీఫ్‌ను కాపాడాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జూన్ 1వ తేదీన పంట కాలువలకు నీరు విడుదల చేసినా ఫలితం జిల్లాలో కనిపించడం లేదు.

శివారుల్లో తరచూ ముంపు

నైరుతి ప్రవేశించిన తరువాత జిల్లాలో రెండు మూడు రోజుల పాటు ఏకధాటిగా వర్షాలు పడిన సందర్భాలు లేవు. సాధారణ వర్షపాతానికి లోటు లేకుండా అడపాదడపా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఈ మాత్రం దానికే నారుమడులు, నాట్లు వేసిన చేలు నీట మునుగుతుండడం రైతులకు ఆందోళనకు గురి చేస్తోంది. మరీ ముఖ్యంగా జిల్లాలో తీర ప్రాంత మండలాలైన సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలతో పాటు రాజోలు, ముమ్మిడివరం, అమలాపురం, అయినవిల్లి మండలాల్లో ముంపు తీవ్రత అధికంగా ఉంటోంది. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో కొద్దిపాటి వర్షానికే చేలు ముంపుబారిన పడుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే భారీ వర్షాలు పడితే చేలు ముంపు బారిన పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూడిక తొలగింపునకు అరకొర నిధులు

మధ్య డెల్టాలో కాలువలు గుర్రపుడెక్క, తూడుతో మూసుకుపోయాయి. వీటి తొలగింపు, ఇతర అత్యవసర పనులు నిమిత్తం ఉమ్మడి గోదావరి జిల్లాలో అత్యవసరంగా చేయాల్సిన పనులను 430 గుర్తించారు. ఈ పనులకుగాను రూ.32.85 కోట్లు కేటాయించాలని నివేదించారు. అయితే 306 పనులకు రూ.20.78 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీనిలో మురుగు కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, ఇతర పూడిక తొలగింపు పనులకు (కేవలం 99 పనులకుగాను) రూ.9,14,17,000 మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయడం ఆలస్యం కావడంతో ఇప్పుడు పనులు మొదలు పెట్టారు. అయితే ఈ నిధులతో పూర్తి స్థాయిలో పూడిక తొలగింపు సాధ్యం కాదని రైతులు పెదవి విరుస్తున్నారు.

మొగలతో ప్రధాన సమస్య

మధ్య డెల్టాలో ప్రధాన డ్రెయిన్ల నుంచి ముంపు నీరు గోదావరి నదీపాయలు, సముద్ర మొగల ద్వారా దిగాల్సి ఉంది. రామేశ్వరం మొగ ద్వారా పూర్తిస్థాయిలో కాకున్నా.. కొంతవరకు ముంపునీరు దిగుతోంది. కానీ కూనవరం, కేశవదాసుపాలెం స్ట్రెయిట్ కట్‌లు ఇసుక మేటలు వేసి ఉన్నాయి. వీటి నుంచి సుమారు 45 వేల ఎకరాల ముంపు ఆయకట్టు నీరు ఉంది. ఇక్కడ చేపట్టాల్సిన పనులపై పూడిక తొలగింపు ప్రభుత్వం ఇంతవరకూ ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ఇటు మొగలు, అటు డ్రెయిన్లు సముద్ర తీర మండలాల్లో ఖరీఫ్ సాగుకు బంధనాలు వేస్తున్నాయి.

రెండు గ్రామాల్లో పంట విరామం

మురుగునీటి కాలువలు మూసుకుపోయి పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాలు ముంపు బారిన పడి వరి పంటను తీవ్రంగా నష్టపోతున్నామని అల్లవరం, రెల్లుగడ్డ గ్రామానికి చెందిన రైతులు ముంపు ప్రాంతాల్లో ఖరీఫ్ పంటకు విరామం ప్రకటించారు. లోయర్ కౌశిక డ్రెయిన్ 17 కిలోమీటర్ల పొడవునా ఆక్రమణకు గురై, డ్రెయిన్ కుంగిపోయి ముంపు నీరు వెళ్లడం లేదని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే బాటలో మరికొందరు రైతులు కూడా ఉన్నారు.

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ దుర్గాప్రసాదరావుకు సత్యదేవుని చిత్రపటం అందిస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు, సత్యదేవుని చిత్రపటం, ప్రసాదాన్ని ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

తల్లీ నిను దలంచి.. అందరి మేలెంచి..

- అమ్మ పేరిట అందరూ మొక్కలు నాటాలని ప్రధాని మోదీ పిలుపు
- అపురూపంగా సంరక్షిస్తారనే ఉద్దేశంతో ఈ విధంగా ప్రచారం
- పాఠశాలల్లో నిర్వహించేలా విద్యాశాఖ ఆదేశాలు

రాయవరం: అమ్మను మించి దైవమున్నదా... అని పాడుకున్నా... పెదవే పలికే మాటల్లోనా తీయని మాటే అమ్మ అని కీర్తించినా.. అంతటి ఘనత అమ్మకు మాత్రమే దక్కుతుంది. నవమాసాలు మోసి తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పిల్లల్ని కని పెంచే అమ్మకు ఏమిచ్చినా రుణం తీర్చుకోవడం సాధ్యం కాదు. సృష్టిలో అమ్మకు ఎంతటి గౌరవం దక్కుతుందో. ప్రకృతి పరంగా తన, పర భేదం లేకుండా అందరికీ నీడనిచ్చే చెట్టుకు కూడా అంతే ప్రాధాన్యముంది. నాటి కేవలం నీరు పోస్తే చాలు ఎలాంటి లాభాపేక్ష లేకుండా మన కోసం తన సర్వస్వాన్ని ధారపోసే మొక్కను అమ్మ పేరిట నాటితే మనకు మనమే కాకుండా సమాజానికి మేలు చేసిన వారమవుతాం. భారత ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్కను నాటి, ఆమెతో ఫొటో దిగి లేదా ఆమె ఫొటోతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టాలని పిలుపునిచ్చారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరిట ఒక మొక్క)' ప్రచారాన్ని ప్రారంభించారు. పుడమి తల్లి పరిరక్షణకు ఈ పిలుపు దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ఇప్పుడు ఇదే పిలుపుతో పాఠశాలల్లో కూడా విద్యార్థులు మొక్కలు నాటాలని విద్యాశాఖ పిలుపునిచ్చింది.

అమ్మ పేరిటే ఎందుకంటే..

సృష్టిలో అమ్మ ప్రేమకు ఉన్న ప్రత్యేక స్థానం దృష్ట్యా అమ్మ పేరిట మొక్కను నాటితే వాటిని అపురూపంగా పెంచి పెద్ద చేసే అవకాశం ఉంటుంది. శుభకార్యాలు, పుట్టిన రోజు, పెళ్లి రోజుల్లో ఆ ఒక్కరు, లేదా జంట పేరిట ఒక మొక్క మాత్రమే నాటే అవకాశముంటుంది. కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరికీ అమ్మ ఉంటుంది. కొందరికి తల్లి మరణించినా.. వారి జ్ఞాపకార్థం మొక్క నాటడానికి అవకాశముంది.


మొక్కలు నాటడంతో రహదారికిరువైపులా పరిఢవిల్లుతున్న పచ్చదనం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

అమ్మ పేరిట మొక్క నాటి వాటిని సంరక్షించగలిగితే దేశంలో ఉన్న 140 కోట్ల జనాభా ఉన్న మనదేశంలో అన్ని కోట్ల మొక్కలు నాటే వెసులుబాటు కలుగుతుంది. వాటిని ఎవరికి వారు సంరక్షించగలిగితే పర్యావరణానికి ఎంతో మేలు చేకూరే అవకాశాలు ఉంటాయి.

పర్యావరణ సమతుల్యతకు భూభాగంలో 33 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలి. అటవీ విస్తీర్ణం తగ్గిపోతున్న కారణంగానే అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు, వేసవిలో 50 డిగ్రీలకు ఎండ తీవ్రతలు చేరుకుంటున్నాయి. పర్యావరణ అసమతుల్యతను నిరోధించి దేశంలో అటవీ విస్తీర్ణాన్ని పెంపొందించే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రభుత్వ పరంగా 1950లో శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉంటే కోనసీమ జిల్లాలో 7,720 హెక్టార్లలో అడవులు ఉన్నాయి. 6,520 హెక్టార్లలో మడ అడవులు ఉండగా, 1,200 హెక్టార్లతో సరుగుడు తోటలు ఉన్నాయి.

ఇదీ లెక్క..

50 సంవత్సరాల వ్యవధిలో ఒక చెట్టు రూ.21 లక్షల విలువైన ఆక్సిజన్‌ను అందిస్తుంది. ఒక చెట్టు తన ఆకుల ద్వారా రోజుకు 100 గ్యాలన్ల నీటిని గాలిలో తేమ రూపంలో వదులుతుంది. అందుకే చెట్లు ఉండే ప్రాంతాల్లో ఐదు డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఒక ఎకరం విస్తీర్ణంలోని చెట్లు ఏడాదికి 2.6 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ను వాతావరణం నుంచి తొలగిస్తాయి. చెట్ల వేర్లు భూగర్భంలోని జలాల నుంచి ప్రమాదకరమైన కాలుష్యాన్ని తొలగించి శుద్ధి చేస్తాయి. రెండు చెట్లు రోజుకు నలుగురు ఉన్న కుటుంబానికి సరిపడా ప్రాణవాయువును అందిస్తాయి. ఒక చెట్టుకు రెండు నుంచి నాలుగు లక్షల ఆకులు ఉంటాయి. ఇవి గాలిని శుభ్రపరిచే ఫిల్టర్ల లాగా పని చేస్తాయి. ఒక ఎకరంలో దట్టంగా విస్తరించిన చెట్లు 13 టన్నుల ధూళిని తొలగిస్తాయి. చెట్లు లేని రహదారిలో లీటరు గాలిలో 10 నుంచి 12 వేల ధూళికణాలు ఉంటే, చెట్టు ఉన్న ప్రాంతంలో కేవలం 3 వేలు మాత్రమే ఉంటాయి. ఒక చెట్టు ఇచ్చే చల్లదనాన్ని 20 ఎయిర్ కండీషనర్లు రోజుకు 20 గంటలు పని చేసినా ఇవ్వలేవు.

లక్ష్యంతో పాటు సంరక్షణ ప్రధానమే

వన మహోత్సవంలో భాగంగా ఏటా మొక్కలు నాటుతున్నారు. మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉంది. నివాసాల ముందు, రహదారులపై నాటిన మొక్కలను కూడా రక్షించుకోలేక పోవడంతో పట్టణాలు, గ్రామాల్లో నిలువ నీడ లేకుండా పోతోంది. మొక్కలు తక్కువగా ఉండడం, కాంక్రీట్ జంగిల్ వేసవిలో భానుడి ప్రతాపానికి కారణంగా ప్రతీ ఒక్కరూ గుర్తించాలి.

విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు

ఈ నెలాఖరు వరకు «అమ్మ పేరిట ఒక మొక్క» అనే కార్యక్రమాన్ని పాఠశాలల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పిలుపునిచ్చారు. అసెంబ్లీలో విద్యార్థులతో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించడంతో పాటుగా, ప్రతీ ఒక్కరూ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అమ్మ పేరిట నాటిన మొక్కలతో తల్లితో పాటు ఫొటోలు తీసుకోవాలి. పాఠశాలల్లో తగినంత స్థలం లేని పక్షంలో ఇంటి వద్ద లేదా రహదారుల పక్కన మొక్కలు నాటి వాటి సంరక్షణను నాటిన వారే చేపట్టాలి. విద్యాశాఖలో భాగమైన నేషనల్ కోర్ కూడా ఈ బాధ్యతను చేపడుతోంది. జిల్లాలో 1,579 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలలతో పాటుగా, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది. జిల్లాలో ఉన్న 1.90 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యే అవకాశముంది.

అడవుల వల్ల ఉపయోగాలిలా..

ప్రకృతిలో మొక్కలను పరిశీలిస్తే ప్రతి మొక్క ఏదో ఒక ఔషధ గుణాన్ని కలిగి ఉంటుంది. ఔషధాల తయారీలో మొక్కలు ఉపయోగపడుతున్నాయి. పారిశ్రామికంగా పరిశీలిస్తే పేపరు తయారీ, పెన్సిల్, సబ్బులు, నూనె, రసాయన పదార్థాల తయారీకి దోహదపడుతున్నాయి. ఇళ్ల నిర్మాణ సామగ్రి, అలంకరణ వస్తువుల తయారీకి ఉపయోగపడుతున్నాయి. ఆహారం, దుస్తులు, నివాసం అవసరాలను తీరుస్తున్నాయి. రోజూ తినే వరి, గోధుమ, పప్పు దినుసులు, నూనెలు, కూరగాయలు, పండ్లు వంటివి వివిధ రూపాల్లో లభిస్తాయి. చెట్లు నేల పటుత్వాన్ని, భూసారాన్ని చక్కగా కాపాడతాయి. ప్రకృతికి అందాలను చేకూర్చడంలో, వ్యవసాయంలోనూ ప్రధాన పాత్ర పోషిస్తాయి.

ప్రతి పాఠశాలలో పండగలా నిర్వహించాలి



అమ్మ పేరిట ఒక్క మొక్క అనే కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహించాలి. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి. మానవ మనుగడలో ప్రధాన పాత్ర పోషించే మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం ఒక యజ్ఞంలా చేపట్టాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

విద్యార్థి దశ నుంచే వివరించాలి



మొక్కలు నాటడం, చెట్లను సంరక్షించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థి దశ నుంచే వారికి అవగాహన కల్పించాలి. ప్రపంచ పర్యావరణాన్ని పరిరక్షించడంలో నేటి విద్యార్థుల పాత్ర చాలా కీలకమవుతుంది. అమ్మ పేరిట మొక్కను నాటడం వలన విద్యార్థులకు అమ్మ విలువ, మొక్కల గొప్పదనం రెండూ అర్థమవుతాయి.

– ఎ.మధుసూదనరావు, డిప్యూటీ కలెక్టర్, ఏపీసీ, సమగ్ర శిక్షా, అమలాపురం

ఎకో క్లబ్‌ల ఏర్పాటు



జిల్లాలో సుమారు 600 పాఠశాలల్లో నేషనల్ గ్రీన్‌కోర్ తరఫున ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేశాం. ఒక్కో పాఠశాలలో ఆరు క్లబ్బుల వంతున 3,600 వరకు ఎకో క్లబ్బులు ఏర్పాటు చేయగా, ఒకో క్లబ్‌లో 10 మంది విద్యార్థులున్నారు. అమ్మ పేరిట మొక్క కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ భాగస్వామ్యమై మొక్కల సంరక్షణ చేపడుతుంది.

– జి.ప్రభావతి, స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్, నేషనల్ గ్రీన్‌కోర్, రాజోలు.

క్లుప్తంగా

కేజీబీవీలో తనిఖీలు


వాకదారిపేట కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ రమణ

తొండంగి: మండలంలోని కోదాడ పంచాయతీ వాకదారిపేట కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ)ను స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ రమణ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థినులకు సంబంధించి మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ, డిజిటల్ బోధన, గ్రేడింగ్ తదితర అంశాలకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రంలో సౌకర్యాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉన్న గుర్తు తెలియని మృతుడు

శంఖవరం: ఈ నెల 8వ తేదీన జాతీయ రహదారిపై ఎంఆర్‌ఎఫ్ షోరూం వద్ద గుర్తు తెలియని వ్యక్తిని లారీ బలంగా ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి తుని వెళుతున్న లారీ రోడ్డు దాటుతున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టిందన్నారు. దీంతో బాధితుడిని స్థానికుల సహాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు తెలిపారు. అయితే కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. అప్పటి నుంచి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం కోసం ప్రకటన ఇచ్చామన్నారు. సుమారు 65 సంవత్సరాల వయస్సు ఉండొచ్చని, ఎడమ చేతికి మోచేయి నుంచి మణికట్టు వరకు సిమెంట్ కట్టు ఉందన్నారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. సమాచారం కోసం అన్నవరం ఎస్సై కిశోర్‌ను సంప్రదించాలన్నారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్ట్

రాజోలు: బాలికను వేధించిన యువకుడిని రాజోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. రాజోలు ఎస్సై పృథ్వీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములికిపల్లి గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక పొన్నమండ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 11వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. బాలిక భయంతో కేకలు వేయడంతో తల్లి రాగా దుర్గాప్రసాద్ పారిపోయాడు. మూడు నెలలుగా దుర్గాప్రసాద్ తమ కుమార్తెను వేధిస్తున్నాడని, ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని తండ్రి దొమ్మేటి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి రాజోలు కోర్టులో హాజరుపర్చారు.

ఎర్విన 3.0 ప్రారంభం


ఎర్విన ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైద్యులు, అతిథి, నిర్వాహక బృందాలు


విద్యార్థులకు సర్జరీ ప్రక్రియను వివరిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

కాకినాడ క్రైం: వైద్య విద్యార్థుల విజ్ఞాన వేడుక ఎర్విన 3.0 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ప్రత్యక్ష పర్యవేక్షణలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి మార్గనిర్దేశంలో జరుగుతోంది. ఎర్విన కోర్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సందీప్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవంలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి మాట్లాడుతూ, ఎర్విన 3.0 శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగుతుందన్నారు. మూడేళ్ల క్రితం తరుణ్‌కుమార్ సువారి మదిలో మెదిలిన ఆలోచనల ప్రతిరూపమే ఎర్విన అన్నారు. ఇందుకు రంగరాయ స్టూడెంట్స్ రీసెర్చ్ సొసైటీ ఏర్పడిందని తెలిపారు. రెండవ ఏడాది దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది వైద్య విద్యార్థులతో డాక్టర్ అనిరుధ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎర్విన వేడుక దేశం.. రంగరాయ వైపు తిరిగి చూసేలా చేసిందన్నారు. అదే స్ఫూర్తితో మూడవ ఏడాది నిర్వహిస్తున్న విజ్ఞాన వేడుకకు 400 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు ఎర్విన వేదికగా నిర్వహించే పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్‌లు, క్విజ్, బేసిక్ మెడికల్ టెక్నిక్స్, సూచరింగ్ టెక్నిక్స్, సీపీఆర్‌తో పాటు 23 విభాగాలకు చెందిన వర్క్‌షాప్‌లు వారి భవితకు ఎంతో దోహదపడనున్నాయన్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే వైద్య విద్యార్థులకు ఎర్విన విజ్ఞానం, వినోదాలను కలగలిపి పంచే ఓ కల్చరల్ ఫీస్ట్ అని అన్నారు. వేడుక నిర్వహణలో డాక్టర్ యశ్వత్, డాక్టర్ అవన్ శర్మ, డాక్టర్ మనోజ్, డాక్టర్ మహాలక్ష్మి సహా పలువురు విద్యార్థులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. డాక్టర్లు ఉమామహేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్, ఎంపీఆర్ విఠల్, కళ్యాణ్, శివ కళ్యాణి, శైలజా రాణి ఎర్విన నిర్వహణకు వైద్య విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

అధికారుల ఆకస్మిక తనిఖీ


చింతలూరులో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

ఆలమూరు: చింతలూరులో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాన్ని అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి కె.వీరబాబు ఆధ్వర్యంలో అధికారుల బృంద సభ్యులు డీపీహెచ్‌ఎన్‌ఓ పీబీఎల్ కుమారి, డేటా మేనేజర్ ఎస్‌టీపీ కృష్ణమూర్తి, డీపీఓ ఎన్.రవి, ఏఎస్‌ఏ ఎం.పాదాలు రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలు, ఆరోగ్య రక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. చిన్నారులకు అందిస్తున్న టీకాలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించిన ఆ బృందం వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ప్రజలను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య రక్షణకు అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టిందని, ఆ దిశగా వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిశోర్ కృషి చేయాలని సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో బాలింతలు, గర్భిణులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు పి.ఉమ, ఎం.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ వి.సువర్చల, ఆరోగ్య సిబ్బంది పి.కృష్ణవేణి, ఎస్.రాణి ప్రియదర్శిని పాల్గొన్నారు.

కోకో గింజల చోరీపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలో కోకో గింజల చోరీపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శుక్రవారం తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన సోము నరేష్ కాటకోటేశ్వరం గ్రామంలో కోకో సాగు చేస్తున్నాడు. పొలం వద్ద నిల్వ వుంచిన రూ.60 వేల విలువ చేసే 130 కేజీల కోకో గింజలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు రైతు నరేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

కొవ్వూరు: తన భర్త అదనపు కట్నం కోసం తనను శారీరకంగాను, మానసికంగాను వేధిస్తున్నట్లు పట్టణానికి చెందిన పత్తి నళిని శుక్రవారం ఫిర్యాదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాస్ తెలిపారు. తనకు పట్టణానికి చెందిన పత్తి సురేష్‌కి 2017లో వివాహం అయినట్టు పేర్కొన్నారు. కొన్నాళ్లు సంసారం సవ్యంగానే సాగినప్పటికీ పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నం చాలదని, అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామంలో ఒక ఇంట్లో ఏటిమొగకు చెందిన కర్రి సంతోష్‌కుమార్(33) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో ఇంద్రపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ప్రకారం సంతోష్‌కుమార్‌కు రెండేళ్ల క్రితం భార్యతో విడాకులవ్వడంతో తూరంగికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెకు పెళ్లివ్వగా పిల్లలు ఉన్నారు. గురువారం సాయంత్రం ఆమె ఇంటికి సంతోష్‌కుమార్ వెళ్లాడు. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె తన తల్లికి ఫోన్‌చేసి చెప్పడంతో ఇంట్లోకి వెళ్లి గది తలుపులు పెట్టుకుని ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికుమార్ తెలిపారు.,

ఏపీఆర్ సెట్‌లో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన భానురేఖ


తేతలి భానురేఖ

రాయవరం/బిక్కవోలు: ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన తేతలి భానురేఖ రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించారు. ఈ విషయాన్ని భానురేఖ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది జూన్ 3న తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మంది కామన్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరు కాగా, అందులో 4,500 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారన్నారు. ఈ నెల మొదటి వారంలో ఆదికవి నన్నయ యూనివర్శిటీలో ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. 91808027008 హాల్ టికెట్ నంబరుతో 146 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. కాగా భానురేఖ గతంలో బీటెక్, ఎంబీఏలో గోల్డ్ మెడల్ సాధించారు. హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో ఏపీఆర్‌సెట్‌కు దరఖాస్తు చేసినట్లు ఆమె తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


సామర్లకోట ఫ్లై ఓవర్ బ్రిడ్జి రైలింగ్ ఢీకొన్న కారు


సామర్లకోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నూకరాజు

మోటారు సైకిలు, ఫ్లై ఓవర్ బ్రిడ్జి రైలింగ్‌ను ఢీకొన్న కారు

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా మోటారు సైకిల్‌పై హుస్సేన్‌పురం వెళుతున్న కట్టా నూకరాజును వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దాంతో మోటారు సైకిల్‌పై ఉన్న నూకరాజు పడి పోవడంతో బలమైన గాయాలు తగిలాయి. కారు అదుపు తప్పి ఫ్లై ఓవర్ బ్రిడ్జి రైలింగ్‌ను ఢీకొని ఆగింది. దాంతో బ్రిడ్జి రైలింగ్‌కు చెందిన కమ్మిలు విరిగి సత్యనారాయణపురం రోడ్డులో పడ్డాయి. ఆ రోడ్డులో ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడు నూకరాజును హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన చల్లా బుజ్జి తదితరులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో కారును సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోపణపై డీఎల్‌పీఓ ప్రాథమిక విచారణ


మొగలికుదురులో విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ బుజ్జిరాజు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని ఉప సర్పంచ్ గనసాల దీపిక, పంచాయతీ వార్డు సభ్యులు చేసిన ఫిర్యాదుపై డీఎల్‌పీఓ పి.బుజ్జిరాజు శుక్రవారం ప్రాథమిక విచారణ జరిపారు. పంచాయతీలో సుమారు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు అవకతవకలు జరిగాయని చేసిన ఫిర్యాదుపై డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ దీనికి బాధ్యులని ఆరోపించారు. రోడ్లు, డ్రైన్లతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేయకుండానే, చేసినట్లు రికార్డుల్లో చూపించి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విచారణలో కీలకమైన డిజిటల్ ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంపై డీఎల్‌పీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి సమాచారంతో అధికారులు విచారణకు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీఓ ఆదేశించారు.

దీనిపై మంగళవారం పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తామని తెలిపారు. ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, గ్రామ పెద్దలు సూదా బాబ్జి, దొంగ సత్యనారాయణ, మద్దింశెట్టి అబ్బు, మద్దింశెట్టి బుజ్జి, కొండా జగదీశ్వరరావు, చింతా చిన్న పాల్గొన్నారు.

బాలికను వేధించిన కేసులో నిందితుడి అరెస్ట్

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం చిందాడగరువు గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి వేధిస్తున్నందుకు అదే మండలం నక్కావారిపేటకు చెందిన గొల్లపల్లి కుమార్ చక్రవర్తి (32)ని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. అమలాపురం డీఎస్పీ మహేశ్వరరావు, పట్టణ సీఐ క్రిష్టోఫర్ ఆదేశాల మేరకు నిందితునిపై పోక్సో కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు. బాధిత కుటుంబం నుంచి ఫిర్యాదు అందిన కేవలం 36 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచినట్టు చెప్పారు. కోర్టు మేజిస్ట్రేట్ నిందితుడికి రిమాండ్ విధించినట్టు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. నిందితుడిని కొత్తపేట సబ్ జైలుకు తరలించామన్నారు.